భూసార పరీక్ష.. నేలకు రక్ష



ఎం.పైపల్లెలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)



మట్టి నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

- పంటలకు మేలు
- పంట నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాలను బట్టి ఎరువులు వినియోగంతో ఖర్చు తగ్గుముఖం
- అధిక దిగుబడులకు అవకాశం

ఐరాల: రైతులు సాగు భూమిలో భూసార పరీక్షలు చేయించడం వల్ల అందులో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. దీంతో స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయాధికారులు సిఫారసు మేరకు సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు సాగు భూమిలో ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడవచ్చు తెలియజేయడం వల్ల అనవసర వ్యయం గణనీయంగా తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువులు వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంతమంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగుమందులు అవసరానికి మించి వినియోగిస్తుండడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంట కోత పూర్తయిన తర్వాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి. పొలాలకు సాగు నీరు పెట్టినపుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలు సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి. వరి పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపార నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో భాగా కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తరువాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష కేంద్రాలకు పంపాలి. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

పోషకాల స్థాయిపై పక్కా లెక్క

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయనక పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల, ఆమ్ల, క్షార గుణాలు, ఆ నేలలో ఉన్న పోషకాలు స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా చేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించుకునే అవకాశం కలుగుతంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు ఎంతో మేలు

భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. గత ఏడాది మండలంలోని భూమిలో వరి పంటకు అవసరమైన యూరియా ఎక్కువ మోతాదులో ఉన్నట్లు గుర్తించారు. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ, జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

–వరలక్ష్మి, ఏఓ, ఐరాల

నేటి నుంచి ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలు

- పలు వాహనాల్లో విహరించనున్న దేవతామూర్తులు
- తిరుమల తరహాలో స్వామివారికి వాహన సేవలు



ధ్వజారోహణం (ఫైల్)



చంద్రప్రభ వాహనం (ఫైల్)

యాదమరి(బంగారుపాళ్యం): మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలకు ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం తమిళ నెల వయ్యాశిలో స్వామివారికి ఆగమ శాస్త్రం ప్రకారం 12 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేశారు.

తిరుమల తరహాలో స్వామివారికి వాహన సేవలు

ఇంద్ర వరుదని బ్రహ్మోత్సవాలు తిరుమల తరహాలో వాహన సేవలు నిర్వహిస్తారు. ప్రతి రోజు నిత్య కైంకర్యాలు, అభిషేకాలు పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. వాహన సేవలు సైతం తిరుమల తరహాలో పుర వీధుల్లో నిర్వహించడం ఆనవాయితీ

వాహనాల్లో ఊరేగనున్న స్వామివారు

స్వామివారు బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ చేశారు. 7వ తేదీన శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, 8న ఉదయం సప్రంలో ఉత్సవం, రాత్రి హంసవాహనం, 9న ఉదయం సప్రంలో ఉత్సవం, రాత్రి యాళీవాహనం, 10న ఉదయం సూర్యప్రభ, రాత్రి శేష వాహనం, 11న ఉదయం గరుడ వాహనం, రాత్రి కల్పవృక్ష వాహనం, 12న ఉదయం హనుమంతు వాహనం, రాత్రి కల్యాణం, ఏనుగు వాహనం, 13న మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి తోట ఉత్సవం, 14న రాత్రి అశ్వవాహనం, 15న తీర్థవారి, ధ్వజావరోహణం, 16న ద్వాదశి ఆరాధన, పుష్పపల్లకి సేవ, 17న రాత్రి వడాయితోత్సవాల్లో దేవతామూర్తులు పురవీధుల్లో ఊరేగనున్నారు.

వార్షికోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న ఆలయ అర్చక వేదపండితులు

యాదమరి(బంగారుపాళ్యం): ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం మూలస్థానంలోని శ్రీదేవి, పెరుందేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేసి భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి ఆలయంలో అర్చక వేదపండితులు ఆగమ శాస్త్రం ప్రకారం పుట్టమన్ను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేసి, కంకణాలు ధరించారు. అనంతరం విష్వక్సేనుడి మాడ వీధుల్లో విహరించి ముక్కోటి దేవతలను స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి ఆలయం, వాహన మండపం, మాడ వీధుల్లో చలువ పందిళ్లు వేశారు. ఆలయానికి విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఏర్పాట్లు చేశారు.

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాలకు సోమవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం ఆగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా స్వామివారి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి స్వామివారి చంద్రప్రభ వాహనంలో విహరించనున్నారు.

ధర ఉన్నా.. దిగుబడి లేదు



పుత్తూరు మార్కెట్ యార్డ్‌కు చేరిన తోతాపురి మామిడి కాయలు



పుత్తూరు మార్కెట్ యార్డులో లారీలకు లోడ్ అవుతున్న మామిడి

- మామిడి రైతులకు తప్పని నష్టాలు
- ఈసారి దిగుబడి మరింత దారుణం
- జూన్‌లోనే ముగుస్తున్న మామిడి సీజన్
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు

- ఫ్యాక్టరీలో తోతాపురి టన్ను రూ.26 వేలు
- మండీల్లో తోతాపురి టన్ను రూ.33 వేలు
- బేనీషా రూ.45 వేలు, ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ రూ.55 వేలు
- చందూర రూ.30 వేలు
- పుత్తూరు మార్కెట్ యార్డుకు చేరుతున్న మామిడి



చందూర రకం మామిడి

ఏటా మామిడి రైతు నష్టాలనే చవి చూస్తున్నాడు. ఓఏడు దిగుబడి బాగుంటే, గిట్టుబాటు ధరలేక నష్టపోవడం. ఈ ఏడు ధర ఆశాజనకంగా ఉంటే, దిగుబడి లేకపోవడం వంటి పరిస్థితులను మామిడి రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 20 శాతం దిగుబడి మాత్రమే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పుత్తూరు: సకాలంలో పూత రాకపోవడం, ఆలస్యంగా వచ్చిన పూత రాలిపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడానికి కారణంగా రైతులు చెబుతున్నారు. పగలు అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి మంచు కురవడం వంటి వాతావరణంలో ఊహించని మార్పుల వల్ల పంట దెబ్బతినిందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈసారి తోటల సస్యరక్షణ పేరిట పెట్టిన ఖర్చులు సైతం చేతికి అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 15 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. డివిజన్ పరిధిలో పుత్తూరు, వడమాలపేట, రామచంద్రాపురం, నారాయణవనం మండలాలు ఉండగా అధిక శాతం తోటలు వడమాలపేటలో ఉన్నాయి. ఈ ఒక్క మండలంలోనే ఐదు వేల ఎకరాలు ఉండగా, ఇందులో తోతాపురి రకం అగ్రభాగాన ఉన్నాయి. సాధారణంగా మంచి దిగుబడి వస్తే డివిజన్ మొత్తం మీద 45 నుంచి 50 వేల టన్నుల దిగుబడి వస్తుంది. అయితే ఈఏడు పూత సకాలంలో రాకపోవడంతో పాటు ఆలస్యంగా వచ్చిన పూత సైతం రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు కనీసం మూడు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా నేడు అరటన్ను కూడా చేతి కందేటట్లు లేదు. దీంతో డివిజన్ మొత్తం మీద దిగుబడి 10 వేల టన్నులకు లోపే పడిపోయినట్లు అంచనా. టేబుల్ వెరైటీగా పిలవబడే బేనీషా దిగుబడే లేక అన్నదాతలు అల్లాడిపోయారు. ఒకటీ, అరా మామిడి చెట్లలో కనబడే కాయలను బంధు, మిత్ర వర్గాలకు పంచేందుకే సరిపోయిందని రైతులు వాపోతున్నారు. అదీగాక జూన్ నెల ప్రారంభం నుంచి మొదలైన నైరుతి రుతుపవనాల కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షం అడప దడపా పడుతుండడంతో ఉన్న కాయలు కూడా నేలరాలుతున్నాయి. దీంతో అన్నదాతల కంట కన్నీరు సుడులు తిరుగుతున్నాయి. జూలై 15 వరకు మామిడి సీజన్ కొనసాగాల్సి ఉండగా ఈసారి దిగుబడి తగ్గిన నేపథ్యంలో మరో పది రోజుల్లో మామిడి సీజన్ పూర్తి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వ్యాపారుల సిండికేట్



మామిడి దిగుబడి తగ్గిన నేపథ్యంలో మార్కెట్ యార్డుల్లోని వ్యాపారులతో పాటు జ్యూస్ కంపెనీల వారు సైతం సిండికేట్ అయ్యారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. వాతావరణం సహకరించక, వ్యాపారులు సహకరించక రైతులు ఎలా బతకాలి. వ్యవసాయం జూదంలా తయారైంది. ప్రభుత్వాలు రైతుకు అండగా నిలబడకపోతే తినడానికి భవిషత్‌లో ఏమీ ఉండదు.

–టి.కేశవులు, అధ్యక్షుడు, కేబీఆర్‌పురం మామిడి రైతు సొసైటీ, పుత్తూరు

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాకు ఐదు ఎకరాల మామిడి తోట ఉంది. ఎకరాకి రూ.25 వేలు వంతున రూ.1.25 లక్షలు ఖర్చు పెట్టాను. అయితే దిగుబడి ఏమాత్రం ఆశించన స్థాయిలో రాలేదు. ఇలా ఏటా నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి. వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. రాయితీతో మందులు పంపిణీ చేయాలి. తోటల్లోకి శాస్త్రవేత్తలను పంపి తగిన సూచనలు ఇప్పించాలి.

– దొరైనాయుడు, రైతు, శివగిరి, పిచ్చాటూరు మండలం

పెట్టుబడి సైతం వచ్చేలా లేదు



ఈ ఏడు మామిడి దిగుబడి కేవలం 10 నుంచి 20 శాతానికి మించి లేదు. తోటల సస్యరక్షణకై పెట్టిన పెట్టుబడి సైతం చేతికందే పరిస్థితి కనబడడం లేదు. వాతావరణ మార్పుల కారణంగా ఈసారి నష్టపోయాం. ఏటా మామిడి రైతు ఏదోరకంగా నష్టపోతూనే ఉన్నాడు. దీనికి తోడు మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మా తలరాతలు మాత్రం మారడం లేదు.

– ఎస్.చెంగయ్య, రైతు, కేబీఆర్ పురం, పుత్తూరు మండలం

క్లుప్తంగా

గ్రంథాలయాలను వినియోగించుకోండి



చిత్తూరులోని గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ప్రసన్నకుమార్

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయాల సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని పౌర గ్రంథాలయశాఖ రాష్ట్ర సంచాలకులు ప్రసన్నకుమార్ తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం చిత్తూరు, బైరెడ్డిపల్లె, దామలచెరువు, పూతలపట్టు, జీడీనెల్లూరు, గ్రంథాలయాల్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు సలహాలు ఇచ్చారు. గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి శర్మ, గ్రంథపాలకులు మధుబాబు పాల్గొన్నారు.

భారీ వర్షం



కాణిపాకంలో కమ్మేసిన కారుమబ్బులు

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన జోరువాన కురిసింది. ఈ బలమైన వర్షానికి రోడ్లంతా జలమయంగా మారాయి. కాలువల్లో వర్షపు నీరు సాగుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, వాగులు, వంకలు జలకళను సంతరించుకుంటోంది. మరో భారీ వర్షానికి చెరువులు నిండిపోయే అవకాశాలున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

నేడు వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల 63వ వార్షికోత్సవం శుక్రవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, డీన్ డాక్టర్ పి.సాంబశివ రావుతోపాటు పాలకమండలి సభ్యులు హాజరు కానున్నరని తెలియజేశారు.

ఆరణికి మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న బలిజ సంఘం నేతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు మంత్రి పదవి కల్పించాలని బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు రాందాస్, ఉపాధ్యక్షులు విశ్వనాథ్ డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి గెలవడానికి బలిజ సంఘం నాయకులు విశేషంగా కృషి చేశారన్నారు. రాయలసీమలో ఇద్దరు బీసీ ఎమ్మెల్యేలు గెలిచారని అందులో బలిజ కులానికి చెందిన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తులసిరాం, రెడ్డెప్ప, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నిండ్ర: జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అగరం గ్రామంలో రైతులకు చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రెడ్డిరాము, నాగమణి మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అదేవిధంగా సజ్జ పంట సాగుపై తీసుకోవలసిన సూచనలు ఇచ్చారు. విత్తనశుద్ధి చేయడం వల్ల రైతులకు మేలు జరిగే అంశాలను వివరించారు. రైతులు సజ్జపంటలో కలుపు నివారణపై, సస్యరక్షణపై వివరించారు. అనంతరం రైతులకు సజ్జ విత్తనాలు, విత్తనశుద్ధి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏలు నాగపద్మని, సౌభాగ్యలక్ష్మి, ఏఓలు యామిని, పద్మజ, ప్రసన్నలక్ష్మి, తులసీరాం, రైతులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను అబ్జర్వర్ ప్రసన్న కుమార్ తనిఖీ చేశారు. ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆయనను అబ్జర్వర్‌గా నియమించారు. ఆయన గురువారం జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణలో తప్పిదాలు జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా పుష్పపల్లకి



బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న శ్రీ నల్లాపురెమ్మ ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి పుష్పపల్లకి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చారు. గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ గురువారం మధ్యాహ్నం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. పల్లకితో పాటు పూలగెరిగ మెరవణి భక్తులను ఆకట్టుకుంది.

నగరంలో వర్షం



కొంగారెడ్డిపల్లెలో కురుస్తున్న వర్షం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాలు నీటిమట్టమయ్యాయి. వర్షపు నీరు కాలువలు నిండి రోడ్డు మీదకు రావడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గాలివానకు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు కాస్త ఉపశమనం చెందారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



జీడీ నెల్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు

గంగాధర నెల్లూరు: బాల కార్మికుల చట్టం 1986 ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలు దుకాణాల్లో పని చేయకూడదని, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాధికారి ఆంజనేయులు శెట్టి, సీఐ మారుతి శంకర్ అన్నారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో వారు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల కార్మికులు దుకాణాలు, హోటళ్లలో పని చేయకూడదని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సూచించారు. 14 ఏళ్లలోపు పిల్లలను వాణిజ్య సముదాయాల్లో, దుకాణాల్లో ఎవరైనా పనికి పెట్టుకుంటే ఆ యజమానులకు కఠిన శిక్ష విధిస్తామని తెలిపారు. అనంతరం జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్ నుంచి మండల కేంద్రం వీధుల్లో దుకాణ యజమానులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది మురళి, ఉమాదేవి, సబిత, పూర్ణచంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.